క్లుప్తంగా

కామారెడ్డి తహసీల్దార్‌గా లత

కామారెడ్డి రూరల్: కామారెడ్డి తహసీల్దార్‌గా ఎస్.లత బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ జిల్లాలోని మోపాల్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన లత కామారెడ్డి తహసీల్దార్‌గా వచ్చారు. ఇక్కడ పనిచేసిన వెంకట్‌రావు బదిలీపై నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయికి వెళ్లగా ఆయన స్థానంలో లత కామారెడ్డి తహసీల్దార్‌గా వచ్చారు.

మద్నూర్ తహసీల్దార్‌గా ..

మద్నూర్(జుక్కల్): మద్నూర్ మండల నూతన తహసీల్దార్‌గా మహమ్మద్ ముజీబ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నిజామాబాద్ జిల్లా రుద్రూర్ తహసీల్దార్‌గా పని చేసి అక్కడి నుంచి మద్నూర్‌కు బదిలీపై వచ్చినట్లు నూతన తహసీల్దార్ తెలిపారు. మండలంలో రెవెన్యూ పరంగా ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనను కలువవచ్చని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడిగా సుధాకర్ పటేల్

మద్నూర్(జుక్కల్): బీఆర్‌ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడిగా మండలంలోని పెద్ద ఎక్లారకు చెందిన సుధాకర్ పటేల్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో సుధాకర్‌పటేల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బన్సీపటేల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుధాకర్ పటేల్ మాట్లాడుతూ.. అందిరిని కలుపుకుపోయి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. సర్పంచ్ సురేష్, మద్నూర్ విండో చైర్మన్ శీను పటేల్, మాజీ చైర్మన్లు పాకల విజయ్, తదితరులున్నారు.

వాహనాల తనిఖీ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో మంగళవారం ఎస్సై ప్రభాకర్ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలు తనిఖీ సరైన ధ్రువ పత్రాలు లేని వారికి జరిమానాలు విధించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి సైతం జరిమానాలు వేశారు. ప్రతీ ఒక్కరికి లైసెన్సు, హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏఎస్సై ప్రకాష్, కానిస్టేబుల్ సంపత్, సాయిలు, హమీద్ తదితరులున్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. పలువురికి జరిమానాలు విధించారు. ఎస్సై ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

శాంతినికేతన్ స్కూల్‌ని సందర్శించిన మాలావత్ పూర్ణ

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి పరిధిలోని గురు రాఘవేంద్రకాలనీలో గల శాంతినికేతన్ విద్యాలయాన్ని పర్వతారోహకులు మలావత్ పూర్ణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల విద్యార్థులకు పర్వతారోహణపైన అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియన్, మాలావత్ పూర్ణను శాలువాతో ఘనంగా సన్మానించారు.

జూనియర్ కళాశాల మంజూరు

నిజాంసాగర్(జుక్కల్): మండలానికి జూనియర్ కళాశాలను మంజూరు చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే విడుదల చేశారు. కళాశాల మంజూరుకు కృషి చేసిన హన్మంత్ సింధేకు స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

వాహనాల రాకపోకల నిలిపివేత

బాన్సువాడ రూరల్: బోర్లం క్యాంపు నుంచి బోర్లం గ్రామం వరకు రహదారి విస్తరణ పనులు కొనసాగుతుండటంతో వాహనాల రాకపోకలు నిలిపివేసినట్లు బోర్లం సర్పంచ్ సరళ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బోర్లం గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాల నుంచి ఈ రోడ్డు మీదుగా వెళ్లే వారు గమనించాలన్నారు.

ఎల్‌వోసీ చెక్కు అందజేత

ఎల్లారెడ్డి: పట్టణంలోని 12వ వార్డు చెందిన కృష్ణయ్యకు రూ.లక్ష ఎల్‌వోసీ చెక్కును మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మంగళవారం అందజేశారు. కృష్ణ కాలికి గాయం కావడంతో ఆపరేషన్ నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఎమ్మెల్యే జాజాల సురేందర్ రూ.లక్ష ఎల్‌వోసీ చెక్కును మంజూరు చేయించారన్నారు. కౌన్సిలర్ నీలకంఠం, బీఆర్‌ఎస్ నాయకులు సతీష్ తదితరులున్నారు.

రామారెడ్డిలో కల్యాణ లక్ష్మి చెక్కులు..

రామారెడ్డి: స్థానిక రైతు వేదికలో కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను రామారెడ్డి ఎంపీపీ దశరథ్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోజా, వైస్ ఎంపీపీ రవీందర్ రావు, రైతుబంధు మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరం

మాచారెడ్డి: ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని గజ్యా నాయక్ తండా సర్పంచ్ హంజీ నాయక్ అన్నారు. మంగళవారం గజ్యానాయక్ తండాలో స్వచ్ఛంద సేవా సంస్థ కార్యకర్త అస్లామ్ ఆధ్వర్యంలో కామారెడ్డి దంత వైద్యులు సాజిద్, సార 82 మందికి చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. ఏఎస్సై రామేశ్వర రెడ్డి, ఉప సర్పంచ్ కిషన్ ఉన్నారు.

మురుగుకు నిలయాలు

- దోమల బెడదతో స్థానికుల ఆందోళన
- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు



వర్షం కారణంగా నిలుస్తున్న నీరు..



చిన్నమల్లారెడ్డిలో ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న మురుగు నీరు

కామారెడ్డి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో వరద నీరు నిలిచి మురికి కూపాలుగా మారాయి. దోమల బెడదతో ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. ఇప్పటికే గ్రామాల్లోని ప్రజలు జలుబు, కండ్ల కలక, జ్వరాలతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ప్రధానంగా కామారెడ్డి పట్టణ శివారులోని దేవునిపల్లి, లింగాపూర్ గ్రామంలోని కల్కినగర్, టేక్రియాల్, రామేశ్వర్‌పల్లి, పాతరాజంపేట, సరంపల్లి, అడ్లూర్, చిన్నమల్లారెడ్డి తదితర గ్రామాల్లోని ఖాళీ ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటున్నాయి. ఆయా గ్రామాల్లో కొత్తగా ఏర్పాటవుతున్న ఇళ్ల పరిసర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలు పిచ్చి మొక్కలతో నిండి ఉన్నాయి.

ప్లాట్లు కొని ఖాళీగా విడిచి పెడుతున్నారు..

భిక్కనూరు, దోమకొండ, రామారెడ్డి, తాడ్వాయి, రాజంపేట, మాచారెడ్డి తదితర మండలాలకు చెందిన పలువురు ఉద్యోగులు, చిరు వ్యాపారులు కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు శివారు గ్రామాల్లోని దేవునిపల్లి, టేక్రియాల్, గర్గుల్, సరంపల్లి గ్రామాల్లో ప్లాట్లను కొనుగోలు చేశారు. వాటిలో ఇళ్లను నిర్మించకపోవడంతో ఖాళీగా ఉన్నాయి. వీటిలో తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలు మొలిచాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఖాళీ ప్లాట్లలో నీరు నిలిచి దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయి. ఖాళీ ప్లాట్ల యజమానులకు పంచాయతీ కార్యదర్శులు నోటీసులిచ్చి నీరు నిల్వ ఉండకుండా చూడాల్సి ఉండగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా దేవునిపల్లిలోని కాకతీయనగర్, లింగాపూర్ శివారులోని కల్కినగర్, చిన్నమల్లారెడ్డిలోని పాత గౌడ్స్ కాలనీల్లో వరద నీరు నిలవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్లలోకి కప్పలు, పాములు, విష పురుగులు రావడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పాలకవర్గం పట్టించుకోవడం లేదు



తమ ఇంటి పక్కన ఖాళీ ప్లాట్లలో డ్రైనేజీ లేక మురుగు నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, పాము లు తిరుగుతున్నాయని పలు మార్లు గ్రామ పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా గౌడ్స్ పాత కాలనీలో కరెంట్ కూడా లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కాలనీకి రోడ్డు లేకపోతే ఇంటికి కొన్ని పైసలు వసూలు చేసి రోడ్డు వేసుకున్నాం. జీపీ నుంచి కనీసం డ్రైనేజీ కూడా కట్టడం లేదు.

– గంగాయల నారాగౌడ్, చిన్నమల్లారెడ్డి

చర్యలు తీసుకుంటున్నాం



మండలంలోని ఆయా గ్రామాల్లో ఖాళీ స్థలాలను గుర్తించి వరదనీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాం. ఖాళీ ప్లాట్ల యజమానులకు నోటీసులిచ్చాం. చిన్నమల్లారెడ్డిలో వరద నీరు బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంది. దోమలు వృద్ధి చెందకుండా నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్నాం. గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాం.

–మలహరి, ఎంపీవో, కామారెడ్డి

కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం

- మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి



జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో.. బైక్‌ర్యాలీ

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలో పోటీ చేయనున్న సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి అన్నారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో ఆమె మాట్లాడుతూ.. సీఎం కామారెడ్డి నుంచి పోటీ చేయడం నియోజవర్గ ప్రజల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కేసీఆర్ కామారెడ్డిని ఎంచుకోవడం వల్ల ఇక్కడ అభివృద్ధి వేగం పుంజుకోనుందని, చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి జరగడం ఖాయమని తెలిపారు. కామారెడ్డి మున్సిపాలిటీ కార్పొరేషన్ కావాలని కోరుకుంటున్నానని, సీఎం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు అపర్ణ, శంకర్‌రావు, గోదావరి, కృష్ణాజిరావు, రాణి, మమత, రవీందర్‌గౌడ్, ముదాం ప్రముఖ, ఇమ్రాన్, వంశీకృష్ణ, తాటి లావణ్య తదితరులున్నారు.

గెలిపించుకోవాలని కోరుతూ బైక్ ర్యాలీ

కామారెడ్డి టౌన్/కామారెడ్డి రూరల్/రామారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్న సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. రామారెడ్డిలో ప్రముఖ పుణ్యక్షేత్రం కాలభైరవుడి ఆలయంలో కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు.

'కామారెడ్డిని దోచుకునేందుకే కేసీఆర్ పోటీ'



భిక్కనూరులో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

భిక్కనూరు: సీఎం కేసీఆర్ గజ్వేల్ ప్రాంతంలో భూములను పూర్తిగా ఆక్రమించుకున్నాడని, అక్కడ ఇక భూములు లేకపోవడంతో కామారెడ్డి ప్రాంతంలో ఉన్న భూములను దోచుకునేందుకు సీఎం కేసీఆర్ కుట్ర పన్ని కామారెడ్డిలో పోటీకి వస్తున్నాడని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు విమర్శించారు. వారు మంగళవారం భిక్కనూరు మండల కేంద్రంలో మాట్లాడుతూ.. షబ్బీర్ అలీ చేతిలో కేసీఆర్‌కు ఓటమి తప్పదన్నారు.కామారెడ్డిలో బీఆర్‌ఎస్ నేతలు చేసిన అక్రమాలు అవినీతిని ప్రజలు ఇంకా మరిచిపోలేదని కేసీఆర్‌ను తమ ఓటుతో ఓడించి తగిన గుణపాఠం చెబుతారన్నారు. గంప గోవర్ధన్ ఓడిపోతాడనే గ్రహించి కేసీఆర్‌ను పోటీకి ఆహ్వానించారన్నారు. సీఎం కేసీఆర్ ఇప్పుడు తన పూర్వికుల గ్రామం కోనాపూర్ అని చెబుతున్నాడని గత పదేళ్లుగా ఈ గ్రామానికి ఏమి చేశారో చెప్పాలన్నారు.

బస్ షెల్టర్ నిర్మాణానికి భూమి పూజ



శాబ్దిపూర్‌లో భూమిపూజ చేస్తున్న అంజనేయులు

కామారెడ్డి రూరల్:శాబ్దిపూర్‌లో బస్‌షెల్టర్ నిర్మాణ పనులకు మంగళవారం ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు భూమి పూజ చేశారు. బస్‌షెల్టర్ నిర్మాణానికి ప్రభుత్వవిప్ గంపగోవర్ధన్ రూ.3 లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీపీ తెలిపారు. వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్, సర్పంచ్ యాదమ్మ పరశురాం, మాజీ జెడ్పీటీసీ నిమ్మ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ సంఘ భవనానికి..

రాజంపేట:మండల కేంద్రంలో ఎస్సీ సంఘ భవనానికి గ్రామ సర్పంచ్ ఆముద సౌమ్య భూమి పూ జ చేశారు. ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అందించిన రూ.4 లక్షల నిధులతో ఈ సంఘ భవన నిర్మాణం చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. ఉప సర్పంచ్ శివకుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు భిక్యాజి బల్వంతరావ్, గ్రామ అధ్యక్షుడు చింతల స్వామి, మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బూత్ కార్యకర్తలే పార్టీకి వెన్నెముక



మాట్లాడుతున్న మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే కల్యాణ్‌శెట్టి



బీజేపీలో చేరుతున్న ఉప్పర్‌పల్లి నేతలు

బీబీపేట: బీజేపీకి బూత్ కార్యకర్తలే వెన్నెముక అని మహారాష్ట్ర అక్కల్‌కోట్ ఎమ్మెల్యే సచిన్ కల్యాణ్ శెట్టి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రవాస్ యోజన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ కోసం పని చేసే కార్యకర్తలను పార్టీ ఎప్పుడు విస్మరించదని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి కార్యకర్త క్షేత్ర స్థాయిలో పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ ప్రచారం చేయాలని అన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలాధ్యక్షుడు నక్క రవీందర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

బీబీపేట: ఉప్పర్‌పల్లికి చెందిన పలువురు మంగళవారం బీబీపేటలో జరిగిన సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యే సచిన్ కల్యాణ్ శెట్టి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. గెల్లు స్వామి, బాల్‌రాజు, మల్లేషం, రాజు, స్వామి, నరేష్‌లు బీజేపీలో చేరారు. బీజేపీ గ్రామాధ్యక్షుడు సంతోష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే హారీశ్

లింగంపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కర్ణాటకలోని దావణగెరె జిల్లా హరిహర బీజేపీ ఎమ్మెల్యే బీపీ హరీష్ సూచించారు. మంగళవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే ప్రవాస్ యోజన వర్క్ షాప్‌లో భాగంగా ఆయన మాట్లాడారు. 8 రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు తెలిపారు.

తెలంగాణలో బీజేపీ స్థితిగతులు , బలోపేతంపై దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు. బూత్ కమిటీ పర్యవేక్షణ, ఎల్లారెడ్డిలో పార్టీ అభ్యర్థి గెలుపుపై దిశా నిర్దేశం చేశారు. ప్రధాన మంత్రి చేస్తున్న అభివృద్ధికి పట్టంకట్టేలా చూడాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు దత్తురాం, కార్యదర్శి రాంచందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పైలా కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాపురెడ్డి, లింగారావు, మురళి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలు ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేయాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రవికాంత్

కామారెడ్డి టౌన్ : అభ్యసన, అభివృద్ధి కార్యక్రమంలో ఉపాధ్యాయులకు సరైన మార్గనిర్దేశం చేయాల్సింది ప్రధానోపాధ్యులేనని స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ ట్రైనింగ్ ప్రొఫెసర్ రవికాంత్ అన్నారు. కామారెడ్డిలోని దేవునిపల్లి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రధానోపాధ్యాయుల మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. పాఠ్య పుస్తకాలను అనుసరించి తరగతిలో బోధనభ్యసన ప్రక్రియ ఉండే విధంగా చూడాలని, గుణాత్మక విద్యను అందించే దిశగా ఉపాధ్యాయులను ప్రేరేపించే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. శిబిరంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.రాజు, అకాడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, రీసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

కోడ్ రాక ముందే ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలి



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ నాయకులు

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ రాకముందే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ అనిల్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కామారెడ్డిలోని అడ్లూర్ ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. 8 ఏళ్ల నుంచి ఈ ప్రభుత్వం ఉపాధ్యాయులు, ఉద్యోగుల పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందన్నారు. కొత్తగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్ లేక విద్యారంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహదినంగా పాటిస్తూ సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద చేపడుతున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పరీక్ష నిర్వహించకుండా రెగ్యులరైజ్ చేయండి



జిల్లా కేంద్రంలో భిక్షాటన చేస్తున్న ఏఎన్‌ఎంలు



మున్సిపల్ కార్యాలయం ఎదుట కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న ఏఎన్‌ఎంలు

కామారెడ్డి టౌన్: తమను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న ఏఎన్‌ఎంలు సమ్మెను కొనసాగిస్తున్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద చేపడుతున్న ఏఎన్‌ఎంలు మంగళవారం భిక్షాటన చేసి, ఏఐటీయూసీ, మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు చేపడుతున్న ఏఎన్‌ఎంలు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరీక్ష నిర్వహించకుండా తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

పొలానికి దారి చూపండి



నిరసన తెలుపుతున్న రైతులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావ్‌పేట్ గ్రామ రైతులు మంగళవారం తహసీల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. మల్లుపేట్ వెళ్లే దారిలో తమ వ్యవసాయ భూములకు వెళ్లడానికి ఇద్దరు రైతులు దారి ఇవ్వడం లేదని ఆందోళన చేశారు. ఉన్న దారిని సైతం ఇద్దరు రైతులు మూసి వేసినట్లు తెలిపారు. ఇద్దరు రైతుల్లో ఒక రైతు తన భూమి నుంచి దారి కోసం రెండు గజాల స్థలం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ మరొక రైతు ఒప్పుకోవడం లేదన్నారు. అధికారులు సర్వే నిర్వహించి తమ పొలాలకు వెళ్లడానికి దారి ఇచ్చే విధంగా చూడాలని కోరారు.

వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి



బీబీపేట: వర్షాకాలంలో వ్యాధులపై ప్రజలకు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో జన ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులకు సంబంధించి ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఎంపీపీ బాలమణి, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్



రాజంపేట: అన్నా చెల్లెళ్ల బంధానికి ప్రతీకగా రక్షాబంధన్ పండుగను మన హిందువులందరు జరుపుకుంటారని కామారెడ్డి బ్రహ్మకుమారీలు అన్నారు. మంగళవారం రాజంపేట మండల కేంద్రంలో సర్పంచ్ ఆముద సౌమ్యతో కలిసి బ్రహ్మకుమారీలు రక్షాబంధన్ కార్యక్రమాన్ని చేపట్టారు. పోలీసు స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, బ్యాంకు, పాఠశాలల్లో పలువురికి రాఖీలు కట్టారు.

పెరిక సంఘం పోస్టర్ల ఆవిష్కరణ



దోమకొండ/బీబీపేట: పెరిక సంఘం చేపట్టిన చలో కోకాపేట భూమిపూజ పోస్టర్‌లను మంగళవారం దోమకొండ, బీబీపేట మండలం యాడారంలో పెరిక సంఘం ఆధ్వర్యంలో చల్ కోకాపేట భూమిపూజ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కుంచాల శేఖర్ మాట్లాడారు. ఈ సభకు ప్రతి ఒక్కరు తరలిరావాలని కోరారు. భూమిపూజ కార్యక్రమానికి మంత్రులతో పాటు, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ వస్తారని తెలిపారు.

సంక్షిప్తం

ఇంటికి ఆరు మొక్కల పంపిణీ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): తిమ్మారెడ్డిలో మంగళవారం ఇంటికి ఆరు మొక్కలను సర్పంచ్ అబ్దుల్ అలీ మహ్మద్ పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు వారి ఇంటి పరిసరాలలో పూల, పండ్ల మొక్కలను పెంచాలని గ్రామ ప్రజలకు సూచించారు.

రోగులకు పండ్ల పంపిణీ

భిక్కనూరు: యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఇలియాస్ జన్మదినం సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రితో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, నాయకులు పెంటల తిరుపతిగౌడ్, కిరణ్, తుడుం జీవన్, కర్నాల శ్రీనివాస్, రామగల్ల బాబు,తదితరులున్నారు.

టాటిపత్రిలు, దుప్పట్లు, వంట సామగ్రి..

దోమకొండ: ఇటీవల వర్షాలకు ఇళ్లు కూలిపోయిన పేద కుటుంబాల వారికి రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం టాటిపత్రిలు, దుప్పట్లు, వంట సామగ్రి అందజేసినట్లు రెడ్‌క్రాస్ సొసైటీ మండల అధ్యక్షుడు బుర్రి రవికుమార్ తెలిపారు. సొసైటీ డివిజన్ ఉపాధ్యక్షుడు పున్న లక్ష్మణ్, డివిజన్ సభ్యులు కంది వినోద్‌కుమార్, సభ్యులు పొలకుర్తి శేఖర్, చెన్నుగారి నర్సింలు, బత్తిని సిద్దరాములు, అవదూత సహదేవ్, అంకత్ నర్సింలు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు..

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఇస్సాయిపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం కామారెడ్డి రోటరీ క్లబ్ ప్రతినిధులు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. 6 వందల నోటు పుస్తకాలు, 3 వందల పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు సత్యం, ప్రతినిధులు లక్ష్మీ నర్సింలు, రాజనర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఖాతాదారుడు బీమా చేసుకుంటే బాగుంటుంది



పిట్లం(జుక్కల్): బ్యాంక్‌లోని ఖాతాదారులందరు ప్రమాద బీమా, జీవిత బీమా చేసుకుంటే బాగుంటుందని యూనియన్ బ్యాంక్ మేనేజర్ ముకేశ్ కుమార్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి సురక్ష యోజన కింద ప్రతి సంవత్సరం రూ.20 చెల్లించి రూ.2 లక్షల ప్రమాద బీమా పొందవచ్చని, ఈ బీమా 18 ఏళ్ల నుండి 70 ఏళ్ల వయసు గల బ్యాంక్ ఖాతాదారులకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. అదే విధంగా జీవన జ్యోతి యోజన పథకం కింద సంవత్సరానికి రూ.430 చెల్లించి 2 లక్షల జీవిత బీమా పొందవచ్చని అన్నారు. ఈ బీమా 18 నుంచి 50 ఏళ్ల వయసు గల ఖాతాదారులకు మాత్రమే వర్తిస్తుందని అన్నారు.

డీలర్లు సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): రేషన్ డీలర్లు వినియోగదారులకు ఇబ్బందులు కలిగించకుండా రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ సురేష్ అన్నారు. మంగళవారం తహసీల్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. సమయపాలన పాటించాలని అన్నారు. అనంతరం రేషన్ డీలర్లు తహసీల్దార్‌ను సన్మానించారు. రేషన్ డీలర్లు సురేందర్, శ్రీనివాస్ తదితరులున్నారు.